సాక్షి అనంతపురం

ఆదివారం । 7 । జనవరి । 2024



అంగన్‌వాడీలు విధుల్లోకి రావాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి అంగన్‌వాడీ సిబ్బంది విధులకు హాజరుకావాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు.



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.9°/ 19.2°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత కొనసాగుతోంది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

స్నాతకోత్సవ సంబరం



స్నాతకోత్సవం ప్రారంభిస్తున్న వీసీ రంగజనార్దన



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న వాల్మీకి లక్ష్మీసాయి అపర్ణ



బంగారు పతకం దక్కించుకున్న కూతురును ముద్దాడుతున్న తల్లి



డాక్టరేట్ అందుకోవడానికి చంటిబిడ్డతో వస్తున్న దృశ్యం

- ఘనంగా జేఎన్‌టీయూ(ఏ) 13వ స్నాతకోత్సవం
- 71 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు బంగారు పతకాలు

అనంతపురం: రాయలసీమకే తలమానికంగా నిలిచిన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం (జేఎన్‌టీయూఏ) 13వ స్నాతకోత్సవ సంబరం అంబరమంటింది. శనివారం యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ వేడుక జరిగింది. యూనివర్సిటీ చాన్సలర్/ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఇంజినీరింగ్ విద్యార్థులు పతకాలు, పట్టాలు అందుకోవడం మధురానుభూతిగా నిలిచిపోయింది. ముఖ్య అతిథిగా ట్రాయ్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వేగేశ్న సత్యనారాయణరాజు హాజరయ్యారు. విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ మాజీ వీసీ కె.బాలవీరారెడ్డికి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం ద్వారా జేఎన్‌టీయూ కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరింది. అలాగే 71 మంది బంగారు పతకాలు అందుకున్నారు. వీరిలో 43 మంది అమ్మాయిలే ఉండటం గమనార్హం.



స్నాతకోత్సవ వేదికపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్య అతిథి వేగేశ్న సత్యనారాయణరాజు, గౌరవ డాక్టరేట్ గ్రహీత బాల వీరారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, జేఎన్టీయూ(ఏ) వీసీ రంగజనార్దన, రెక్టార్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, పాలకమండలి సభ్యులు, వర్సిటీ డైరెక్టర్లు

జేఎన్‌టీయూకు సాంకేతిక 'మెరు'పు

అనంతపురం జేఎన్‌టీయూకు మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ (మెరూ)గా గుర్తింపు దక్కిందని వీసీ జింకా రంగజనార్దన తెలిపారు. 13వ స్నాతకోత్సవం సందర్భంగా ఆయన జేఎన్‌టీయూ ప్రగతి నివేదికను వివరించారు. 'మెరూ' గుర్తింపుతో విభిన్నమైన కోర్సులు, వినూత్నమైన పరిశోధనలు, మౌలిక సదుపాయాలు కల్పించడానికి వీలు కలుగుతుందన్నారు. అనంతపురం క్యాంపస్‌తో పాటు పులివెందుల, కలికిరి ఇంజినీరింగ్ కళాశాలల్లో రూ.254 కోట్లతో కొత్త పాలనా భవనం, ఫార్మసీ బ్లాక్, జిమ్ హాల్, యోగా, మెడిటేషన్ భవనాల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. మైక్రోసాఫ్ట్ స్కిల్ కోర్సుల్లో గతేడాదిలోనే ఏకంగా 1.62 లక్షల మంది విద్యార్థులు శిక్షణ తీసుకున్నారని పేర్కొన్నారు. 2022, 2023 ఏపీ ఈఏపీసెట్‌ను కట్టుదిట్టంగా నిర్వహించామన్నారు.

ప్రపంచ స్థాయి ర్యాంకింగ్‌లో చోటు

ప్రపంచ స్థాయి ర్యాంకింగ్ 1201–1500లో ఆంధ్రప్రదేశ్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక యూనివర్సిటీగా జేఎన్‌టీయూఏ గుర్తింపు దక్కిందని వీసీ తెలిపారు. ప్రపంచ స్థాయి యంగ్ యూనివర్సిటీ ర్యాంకింగ్ 401–500లోనూ చోటు దక్కిందన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లకు 16 పేటెంట్లు లభించాయన్నారు. వర్సిటీ పరిధిలో 113 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉండగా, అందులోని 11,300 మంది వలంటీర్లు 51,230 మొక్కలు నాటారన్నారు. 114 రక్త నిర్ధారణ క్యాంప్‌లు నిర్వహించి 8,320 మంది రక్తదానం చేశారన్నారు. 2021–22, 2022–23 విద్యా సంవత్సరాల్లో 137 కంపెనీల్లో 1,625 మంది విద్యార్థులకు కొలువులు దక్కాయన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి మహమ్మద్ ముజమ్మిల్‌కు రూ.44 లక్షల వార్షిక వేతనం గల ఉద్యోగం దక్కడం గర్వకారణమన్నారు. జయంత్ కుమార్‌రెడ్డికి గేట్‌లో జాతీయ స్థాయి 12వ ర్యాంకు, గీతాచరణ్‌కు జాతీయ స్థాయిలో 15వ ర్యాంకు వచ్చిందన్నారు.

- స్నాతకోత్సవ వేదిక మీద ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, సాంకేతిక విద్య డైరెక్టర్ సి.నాగరాణి, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ.కేశవరెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్/పాలక మండలి సభ్యులు బి.దుర్గాప్రసాద్, పాలకమండలి సభ్యులు డి.జ్యోతిశ్వరి, జి.మేరీ మాత (ఎస్ఆర్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్), ఎం.రామశేఖర్‌రెడ్డి, జీవీఎం మోహన్ కుమార్ (పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల), అంజలి జేమ్స్ (డైరెక్టర్, హ్యూమన్ రీసోర్స్, ఫానటిక్స్ ఈ -కామర్స్, హైదరాబాద్), ఎం.వంశీకృష్ణ (కార్డియాలజిస్ట్), బి.ఈశ్వర్‌రెడ్డి, సురేష్ బాబు, సుజాత, ప్రొఫెసర్ కిరణ్మయి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో యూపీఎస్సీ మాజీ సభ్యులు వై.వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎం.లక్ష్మయ్య, మాజీ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతి.. స్వర్ణ కాంతి

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థిని దాసరి శాంతి ఏకంగా ఎనిమిది బంగారు పతకాలు దక్కించుకున్నారు. బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ టాపర్స్ ఆఫ్ జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల, 1982 ఎండోమెంట్ బంగారుపతకం , చల్లా సుబ్బరాయుడు స్మారక బంగారు పతకాలు (రెండు), కే.వెంకటేశ్వర రావు స్మారక బంగారు పతకం, ప్రొఫెసర్ టీఎస్ రాఘవన్ స్మారక బంగారు పతకం, చుండుపల్లి వెంకటరాయలు, సరోజమ్మ స్మారక బంగారు పతకం, ప్రొఫెసర్ బి.విజయ



వీసీ రంగజనార్దన చేతుల మీదుగా 8 బంగారు పతకాలు అందుకున్న దాసరి శాంతి

భాస్కర్ దేశాయ్ దంపతుల బంగారుపతకం ...ఇలా మొత్తం 8 పతకాలు సాధించారు. దాసరి శాంతి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన వారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 90.14 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి కళాశాల టాపర్‌గా నిలిచారు. అమ్మ సావిత్రి. నాన్న నరసప్ప. నాన్న ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. మొత్తం ముగ్గురు కుమార్తెల్లో శాంతి చిన్నవారు. ఒక అక్క టీసీఎస్‌లో, మరొకరు కాగ్నిజెంట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ సాధించడమే లక్ష్యంగా సన్నద్ధమవుతున్నట్లు శాంతి తెలిపారు. ఏకంగా 8 బంగారు పతకాలు దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రణాళికాబద్ధంగా చదవడం, ప్రొఫెసర్ల సహకారం వల్లే ఈ ఘనత సాధ్యమైందన్నారు.



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు

శిక్షణ ఇస్తూ... అభ్యసిస్తూ..



జేఎన్‌టీయూఏ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో 2021–22 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదు బంగారు పతకాలు రావడం గర్వంగా ఉంది. ఫెయిలైన వారికి సాయం చేయాలనే ఉద్దేశంతో వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాను. వారికి సబ్జెక్టు పట్ల ఆసక్తి కలిగేలా బోధించాను. అదే నాకు ఉపయోగపడింది. మంచి మార్కులు సాధించి ఐదు బంగారు పతకాలు రావడానికి అదే కారణం. అమ్మ అలివేలమ్మ, నాన్న ఆనందప్ప ఇద్దరూ వ్యవసాయదారులే.. మాది కాలువపల్లి, పరిగి మండలం. ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో సన్నద్ధమవుతున్నాను. శ్రీ సత్యసాయిబాబా, అమ్మా, నాన్న కృపతోనే ఉన్నత స్థాయికి చేరుకుంటాననే నమ్మకం ఉంది.

– సీబీ సాయి కుమార్, ఐదు బంగారు పతకాలు సాధించిన విద్యార్థి

బంగారు పతకం.. ఆనందం



ప్రస్తుతం డెన్మార్క్‌లో ఇన్సులిన్ తయారీ ఫార్ములా విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నాను. ఏడాదికి రూ. 80 లక్షల ప్యాకేజీతో కూడిన కొలువు. జేఎన్‌టీయూ అనంతపురంలో కెమికల్ విభాగంలో బీటెక్ పూర్తి చేశాను. బీటెక్‌లో ఎక్కువగా ఆన్‌లైన్ కోర్సులైన ఎంపీటీఎల్ వంటి వాటిపై ఫోకస్ పెట్టాను. నాన్న సుదర్శన్‌రెడ్డి అల్ట్రాటెక్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అమ్మ గౌరీ ప్రోత్సాహంతో మంచి ఫార్మా కంపెనీ పెట్టాలనే ఆశయంతో ఉన్నాను. బంగారు పతకం తీసుకోవడానికి విమాన టికెట్లకు రూ.4.5 లక్షలు ఖర్చు పెట్టి జేఎన్‌టీయూకు వచ్చాను. జీవితాన్ని ఇచ్చిన కళాశాల అంటే ఎంతో ప్రేమ. బంగారు పతకం తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– ఎం.సాయి ఉపేంద్రరెడ్డి, కెమికల్ ఇంజినీరింగ్, జేఎన్‌టీయూఏ

తల్లిదండ్రుల కష్టం వృథా కానీయలేదు



మాది నంద్యాల జిల్లా. నాన్న ఇమాం సాహెబ్, అమ్మ మహబూబ్‌బీ. అమ్మా, నాన్న వ్యవసాయ కూలి పనులకు వెళ్లి నన్ను చదివించారు. వారి కష్టం వృథా కానీయకూడదని మంచి ర్యాంకు సాధించి జేఎన్‌టీయూలో మెకానికల్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేశాను. విమానం ఇంజిన్లలో వాడే మెటీరియల్‌ను అభివృద్ధి చేసే పరిశోధన కొనసాగుతోంది. ప్రస్తుతం విజ్ఞాన వర్సిటీ విశాఖపట్నంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను. సమాజానికి ఉపయోగపడే పరిశోధన చేస్తున్నందుకు గర్వంగా ఉంది.

– డాక్టర్ ఇస్మాయిల్, మెకానికల్ విభాగం డాక్టరేట్

బంగారు కొండలు... 8లో







స్నాతకోత్సవానికి హాజరైన యూపీఎస్సీ మాజీ సభ్యుడు వై.వెంకట్రామిరెడ్డి, ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, మాజీ వీసీ రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పల్లె, డిప్యూటీ మేయర్ కోగటం, బంగారు పతకాలు అందుకున్న ఆనందంలో...

నేడు ఉరవకొండలో సాధికార బస్సు యాత్ర

- హాజరు కానున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల జీవితాల్లో వెలుగులు నిండాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత దక్కింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించి పక్కాగా అమలు చేశారు. మంత్రివర్గం మొదలుకొని ఎంపీటీసీ పదవుల వరకు అన్నింటిలోనూ పెద్ద పీట వేశారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించారు. ఆయా వర్గాలకు జరిగిన మేలును వివరించేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఆదివారం ఉరవకొండకు చేరుకోనుంది. యాత్రకు సంబంధించిన ఫ్లెక్సీలు, వైఎస్సార్‌సీపీ జెండాలతో ఆ ప్రాంతం నూతన శోభ సంతరించుకుంది.

సాధికార యాత్ర షెడ్యూల్ ఇలా..

సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా మధ్యాహ్నం 1 గంటకు ఉరవకొండలోని బళ్లారి బైపాస్‌లో గల సత్యం కన్వెన్షన్ హాల్‌లో పలువురు సామాజిక సేవకులు, మేధావులు, రిటైర్డు ఉద్యోగులు తదితరులతో మంత్రులు, ప్రజాప్రతినిధుల ముఖాముఖి ఉంటుంది. మధ్యాహ్నం మూడు గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి బస్సుయాత్ర ప్రారంభమై అంబేడ్కర్ సర్కిల్ వరకు కొనసాగనుంది. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. ఆ తర్వాత పాత బస్టాండ్ సర్కిల్ వద్ద బహిరంగ సభ ప్రారంభం కానుంది.

ప్రజాప్రతినిధుల రాక

సామాజిక సాధికార బస్సు యాత్రలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రులు విడదల రజిని, ఉషశ్రీచరణ్, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్సీ పోతుల సునీత, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, నియోజకవర్గ పరిశీలకులు వాసు హాజరుకానున్నారు.





ఉరవకొండలో సామాజిక సాధికార బస్సుయాత్ర సభ జరిగే ప్రదేశం, వజ్రకరూరులో మాట్లాడుతున్న విశ్వ

యాత్ర చరిత్రలో నిలిచిపోవాలి

వజ్రకరూరు: ఉరవకొండలో ఆదివారం నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్ర చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన వజ్రకరూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్ జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. సంక్షేమ పథకాల ద్వారానూ వారికి లబ్ధి చేకూర్చారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వేలాదిగా సామాజిక సాధికార యాత్రకు తరలిరావాలన్నారు.

భైకును ఢీకొన్న లారీ

- ఇద్దరి దుర్మరణం


ప్రమాదం జరిగిన ప్రాంతం


మోహన్ (ఫైల్)


సునీల్(ఫైల్)

యాడికి: మండల పరిధిలోని రాయల చెరువు– తాడిపత్రి రహదారిపై మోడల్ స్కూల్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మోహన్ (27), సునీల్ (22) అనే యువకులు దుర్మరణం పాలయ్యారు. వివరాలు... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లికి చెందిన మోహన్, సునీల్ స్నేహితులు. శనివారం ద్విచక్ర వాహనంపై తాడిపత్రి వెళ్లారు. ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేయించుకున్న అనంతరం పీఆర్ పల్లికి బయలు దేరారు. మార్గం మధ్యలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా లారీ వేగంగా ఢీకొంది. మోహన్ లారీ చక్రాల కింద పడి మృతి చెందగా, సునీల్ రోడ్డుపై పడి ప్రాణాలు విడిచాడు. మృతుల కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. కుమారుల మృతదేహాల వద్ద లక్ష్మినారాయణ, శ్రీరాములు విలపించిన తీరు కంటతడి పెట్టించింది. ఘటనా స్థలాన్ని సీఐ శంకర్ రెడ్డి, ఎస్ఐ గురు ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. మృతదేహాలను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విజయఢంకా మోగిస్తాం

- 175 స్థానాల్లోనూ విజయం మాదే
- అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త, ఎమ్మెల్యే శంకర నారాయణ


ఎమ్మెల్యే శంకరనారాయణను సన్మానిస్తున్న పార్టీ అధ్యక్షుడు పైలా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లో మరోసారి విజయఢంకా మోగిస్తామని అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ ధీమా వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్తగా అవకాశమిచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ జగనన్నకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తీసుకువస్తానన్నారు. రాష్ట్రంలో ఉన్న 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలు గెలవాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని, ఆ దిశగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరూ పని చేస్తామన్నారు. అనంతపురం నియోజకవర్గంతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ గెలుపునకు చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ స్థాపించిన తర్వాత నుంచి 2019 వరకు ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పని చేయడంతో ప్రతి నియోజకవర్గంలోనూ కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో ప్రత్యక్ష సంబంధ బాంధవ్యాలున్నాయని, వారందరినీ కలుపుకుని ముందుకెళ్తానని తెలిపారు

బస్సు యాత్ర విజయవంతం చేద్దాం

ఉరవకొండలో ఆదివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శంకరనారాయణ పిలుపునిచ్చారు. సామాజిక సాధికార బస్సు యాత్రలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మేలు చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగులకు రాజ్యాధికారం కల్పించారన్నారు. అనంతపురం పార్లమెంటు సమన్వయకర్తగా మాలగుండ్ల శంకర నారాయణ, కళ్యాణదుర్గం అసెంబ్లీ సమన్వయకర్తగా తలారి రంగయ్యకు అవకాశం కల్పించడమే ఇందుకు నిదర్శనమన్నారు. సామాజిక సమీకరణాల్లో భాగంగా సీట్ల కేటాయింపు జరుగుతోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయమే తమకు శిరోధార్యమని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణను పైలా నరసింహయ్య, నగర మేయర్ వసీం తదితరులు పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థ నాయక్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకులు జావెద్, పార్టీ నాయకులు చిట్రా వెంకటేష్, రాళ్ల తిమ్మారెడ్డి, పెన్నోబులేసు,పామిడి వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ నూతన పాలక భవనం ప్రారంభం


నూతన పాలక భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) స్నాతకోత్సవానికి విచ్చేసిన గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ శనివారం వర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన పాలక భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.36.65 కోట్లతో 11 వేల చదరపు మీటర్లలో అత్యాధునికంగా భవనాన్ని నిర్మించారు. ఇకపై ఈ భవనం నుంచే పాలన వ్యవహారాలు కొనసాగనున్నాయి. నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. వర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందని కొనియాడారు.

ముగిసిన 'పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్'

- ఓవరాల్ చాంపియన్‌షిప్ కృష్ణా రీజియన్
- ఖోఖో విజేత అనంతపురం


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

అనంతపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల 26వ స్పోర్ట్స్ మీట్ ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా కృష్ణా రీజియన్ నిలిచింది. ఖోఖో విజేతగా, వాలీబాల్ విభాగంలో ద్వితీయ స్థానంలో అనంతపురం నిలిచింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆర్టీడీ డైరెక్టర్ డాక్టర్ హరినారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యదర్శి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాలిటెక్నిక్ కళాశాలల ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ, ఆంధ్ర రీజియన్ ఆర్జేడీ జేవీ సత్యనారాయణ విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

పాత కక్షలతోనే హత్య

- సయ్యద్ ఆరీఫ్ ఖాద్రీ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- 9 మంది అరెస్టు


నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ గంగయ్య, ట్రైనీ డీఎస్పీ హేమంత్

తాడిపత్రి అర్బన్: పట్టణంలో సంచలనం సృష్టించిన సయ్యద్ ఆరీఫ్ ఖాద్రీ హత్య కేసును పోలీసులు ఛేదించారు. పాత కక్షల నేపథ్యంలోనే హత్య చేసినట్లు ప్రాథమికంగా తేల్చారు. 9 మంది నిందితులను అరెస్టు చేశారు. డీఎస్పీ గంగయ్య, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, ఇన్‌చార్జ్ సీఐ శంకర్‌రెడ్డితో కలిసి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న సాయంత్రం పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో సయ్యద్ ఆరీఫ్ ఖాద్రీ హత్యకు గురయ్యాడన్నారు. మృతుడి తల్లి సయ్యద్ ఫకురున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఇన్‌చార్జ్ సీఐ శంకర్‌రెడ్డి, అర్బన్ ఎస్ఐ రామకృష్ణ రెండు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సీఐ శంకర్ రెడ్డికి ముందస్తుగా అందిన సమాచరం మేరకు శనివారం ఉదయం 9 గంటల సమయంలో స్థానిక శివాలయం సమీపంలో నిందితులు బద్వేల్ రహంతుల్లా, మహ్మద్ అయూఫ్, షేక్ సాధిక్‌వలి, బద్వేల్ షబ్బీర్, తోళ్ల మాబు, షేక్ కలాం బాషా, నన్నేబచ్చే పటాన్ హాజీబాషా, దూదేకుల మహ్మద్, షేక్ చిన్న హాజీబాషాను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి 4 వేట కొడవళ్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. హత్య కేసులో చిక్కేపల్లి ఖాదర్‌బాషా పాత్రపై విచారిస్తున్నామని, మరో ముగ్గురు ముద్దాయిలు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

కక్ష గట్టి చంపేశారు..

నిందితుల్లో ఒకరైన బద్వేల్ రహంతుల్లా, హతుడు సయ్యద్ ఆరీఫ్‌ల మధ్య ఘర్షణలు ఉండేవని డీఎస్పీ తెలిపారు. దీంతో సయ్యద్ ఆరీఫ్, అతని స్నేహితులు కలిసి 2022 ఆగస్టులో ఆసుపత్రి పాలెంలో ఇంటి బయట నిద్రిస్తున్న బద్వేల్ రహంతుల్లా నానమ్మ, మేనత్తపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారన్నారు. అప్పటి నుంచి బద్వేల్ రహంతుల్లా అయూఫ్, తౌఫిక్‌లు తన నానమ్మ, మేనత్తను చంపిన వారిపై కక్ష పెంచుకున్నారన్నారు. ఈనెల 3న సయ్యద్ ఆరీఫ్ ఖాద్రీ మెయిన్ బజార్‌లోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఉన్నాడన్న సమాచారం అందుకున్న నిందితులు అక్కడికి చేరుకుని ఆరీఫ్‌ను చుట్టుముట్టి ఒక్కసారిగా వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి పారిపోయారన్నారు. హత్యకేసు నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్, డీఎస్పీ గంగయ్య, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్‌లు అభినందించారు.

86,142 మందికి పట్టాలు

అనంతపురం: జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో 86,142 మంది పట్టాలకు ఆమోద ముద్ర వేశారు. ఇందులో 68,963 మందికి డిగ్రీ, 15,805 మందికి పీజీ పట్టాలు, 1109 మందికి డాక్టర్ ఆఫ్ ఫార్మసీ, 265 మందికి పీహెచ్‌డీ అవార్డులు ఉన్నాయి. వేదికపై 265 మందికి పీహెచ్‌డీ అవార్డులు అందించారు. తక్కిన వారికి స్నాతకోత్సవ పట్టాలు నేరుగా అందజేస్తారు.

- 2021-22, 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించి 71 బంగారు పతకాలు అందించగా.. ఇందులో 43 బంగారు పతకాలు అమ్మాయిలకే దక్కాయి. ఇందులోనూ దాసరి శాంతి అనే విద్యార్థిని ఏకంగా ఎనిమిది బంగారు పతకాలను కైవసం చేసుకోవడం విశేషం.

2021-22 విద్యా సంవత్సరంలో జేఎన్‌టీయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో బంగారు పతకాలు సాధించిన వారు..

బి. మేఘన (సివిల్ ఇంజినీరింగ్‌లో 4 బంగారు పతకాలు), వి.చైతన్య (ఈఈఈలో 2), సీబీ సాయికుమార్ (మెకానికల్ ఇంజినీరింగ్‌లో 5), దాసరి నిర్డీత (మెకానికల్ ఇంజినీరింగ్ 3 బంగారు పతకాలు), కొండా సాయి తనూజ (ఈసీఈలో 2), మేడా గురు సంతోష్ కుమార్ (సీఎస్ఈలో 1), బి.ప్రదీప్ కుమార్ (ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో 1), టి.చందన (ఎంటెక్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్‌లో 1), ఎస్.గాయత్రి (ఎంటెక్ రిలేబిలిటీ ఇంజినీరింగ్‌లో 1) బంగారు పతకాలు సాధించారు.

- పులివెందుల కళాశాల నుంచి బిజివేముల చంద్ర ప్రకాష్‌రెడ్డి (సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఒకటి), సోమల జగదీశ్వరరెడ్డి (ఈఈఈలో 1), సి.పెంచల లక్ష్మీ సుష్మ (సీఎస్ఈలో ఒకటి) బంగారు పతకాలు సాధించారు.

2022-23లో క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో...

దాసరి శాంతి బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో 8 బంగారు పతకాలు సాధించింది. ఎం.నిత్య శ్రీ (ఈఈఈ విభాగంలో రెండు), .వంశీ (మెకానికల్ ఇంజినీరింగ్‌లో మూడు), ఎస్.సుమంత్ (కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో రెండు)తో పాటు శ్రీగిరి నవనీశ్వర్‌రెడ్డి (మెకానికల్), టీఎం రూపా(ఈసీఈ), ఎం.చిన్న యల్లారెడ్డి (ఈసీఈ), తొల్లేటి శివప్రియ (సీఎస్ఈ), పాలగాటి రాజమోహన్‌రెడ్డి (సివిల్ ఇంజినీరింగ్), సి.గోవర్ధన్ (ఈఈఈ), పి.విష్ణుప్రియ (మెకానికల్ ఇంజినీరింగ్), పి.సంగీత (ఈసీఈ), ఆర్.జయశ్రీ (కంప్యూటర్ సైన్స్), సి.పుష్పలత (ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజినీరింగ్) ఒక్కో బంగారు పతకం సాధించారు.

బంగారు పతకాలు దక్కించుకున్న వారు వీరే..

2021-22 విద్యా సంవత్సరంలో యూనివర్సిటీ స్థాయిలో

పేరు	కళాశాల	బ్రాంచ్
ఎం.సహిస్తా కానమ్	ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లి	సివిల్
వాల్మీకి లక్ష్మీ సాయి అపర్ణ	గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల, గుత్తి	ఈఈఈ
షేక్ అబ్దుల్ అజీజ్	శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు	మెకానికల్
కె.రమ్యశ్రీ	శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి	ఈసీఈ
డి.కావ్య	వేము ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, చిత్తూరు	సీఎస్ఈ
కె.శిరీష	నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు	ఈసీఈ
ఎ.ఎస్. హరిత	శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల,తిరుపతి	ఐటీ
బి.అంబికా కిరణ్మయి	జేఎన్‌టీయూ కలికిరి	ఫుడ్‌టెక్నాలజీ
గోవిరెడ్డి మహిత	నారాయణ ఫార్మసీ కళాశాల, నెల్లూరు	బీఫార్మసీ

2022-23 విద్యా సంవత్సరంలో యూనివర్సిటీ స్థాయిలో

పేరు	కళాశాల	బ్రాంచ్
ఎ.వెంకటసాయి శృతి	విశ్వోదయ ఇంజినీరింగ్ కాలేజీ, కావలి	సివిల్
సి.లీలా దీపక్	గీతాంజలి కళాశాల, నెల్లూరు	ఈఈఈ
ఎస్.సుధీర్ కుమార్	ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి	మెకానికల్
జె.జాహ్నవి	నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరు	ఈసీఈ
బి.సంధ్య	గీతాంజలి ఇనిస్టిట్యూట్, నెల్లూరు	సీఎస్ఈ
వై.మృదుల	ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి	ఐటీ
బి.జయప్రకాష్	జేఎన్‌టీయూ కలికిరి	ఫుడ్‌టెక్నాలజీ
వి. విశాలాక్షి	అన్నమాచార్య ఫార్మసీ కళాశాల, రాజంపేట	బీఫార్మసీ


బంగారు పతకాలు అందుకున్న దాసరి నిర్డీత, మేఘన, చైతన్య, సాయి తనూజ,గురు సంతోష్ కుమార్, నిత్యశ్రీ, వంశీ, శ్రీ గిరి నవనేశ్వర రెడ్డి


రూప | చిన్న యల్లా రెడ్డి | శివ ప్రియ | సుంకర సుమంత్ | ప్రదీప్ కుమార్ | చందన | గాయత్రి | పుష్పలత

కొత్తకార్డులకు ఈ నెల నుంచే బియ్యం పంపిణీ

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కొత్తగా 5,708 బియ్యం కార్డులు మంజూరు చేసింది. 12,793 మంది సభ్యులకు లబ్ధి చేకూరనుంది. కొత్త కార్డుదారులకు ఈ నెల నుంచే బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ వెల్లడించారు. జిల్లాలో ప్రస్తుతం 6.63 లక్షలు బియ్యం కార్డులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వీటికి ప్రతినెలా నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. కొత్తగా బియ్యం కార్డులను ఏడాదికి రెండు సార్లు జూన్, డిసెంబర్ నెలల్లో మంజూరు చేస్తుందన్నారు. అందులో భాగంగా జిల్లాలో అర్హులై ఉండి గత ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు వరకు కొత్త బియ్యం కార్డు, కార్డు విభజన కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ కొత్తగా బియ్యం కార్డును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మంజూరైన కార్డుదారులకు ఈనెల నుంచే సరుకులు, బియ్యం పంపిణీ చేయాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాలిచ్చారని తెలిపారు. ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్దనే సరుకులు, బియ్యం పొందాలని సూచించారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

అనంతపురం మెడికల్: విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లరాదని అడిషినల్ సెషన్స్ జడ్జి హరిత వైద్య సూచించారు. శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫోరెన్సిక్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ వైద్య వృత్తి గౌరవప్రదమైనదన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యనభ్యసించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు ముందుకు వస్తున్నారన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ షారోన్ సోనియా, ఫోరెన్సిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ శంకర్ నాయక్, సైకియాట్రీ విభాగాధిపతి డాక్టర్ వైద్యనాథ్, ఫోరెన్సిక్ వైద్యులు డాక్టర్ గాలేటి చంద్రశేఖర్, డాక్టర్ రమేష్‌బాబు, తదితరులున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ తలారి రంగయ్య, డీఐజీ అమ్మిరెడ్డి



స్వాగతం పలుకుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



జిల్లా కలెక్టర్ ఎం. గౌతమి

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం అతిథి గృహంలో శనివారం గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు సాదర స్వాగతం పలికారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కే. హేమచంద్రా రెడ్డి, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ సి. నాగరాణి, డీఐజీ ఆర్.ఎన్. అమ్మిరెడ్డి, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, మేయర్ వసీం సలీం, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ సి. శశిధర్, ఆర్డీఓలు గ్రంధి వెంకటేశ్, రాణి సుస్మిత తదితరులు పుష్పగుచ్ఛం అందజేశారు.

పేద, మధ్య తరగతి మహిళలకు శుభవార్త

- 6 వేలమంది మహిళలకు ఉపాధి
- 11.35 ఎకరాలను ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు కేటాయించిన ప్రభుత్వం
- ఈ నెలాఖరులోగా ప్రారంభం కానున్న పనులు

రాప్తాడురూరల్: పేద, మధ్య తరగతి మహిళలకు శుభవార్త. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్నకాలనీ వద్ద టెక్స్‌టైల్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. 11.35 ఎకరాల భూమిని ఏపీ ట్రేడ్ ప్రమోట్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం అప్పగిస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. 125 ఎకరాల జగనన్న లేఔట్‌లో 6,500 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక్కడ నివాసం ఉండే కుటుంబాల్లోని మహిళలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక్కడ ఏర్పాటు కానున్న పరిశ్రమల్లో దాదాపు 6 వేల మంది మహిళలకు ఉపాధి లభించనుంది. గత ప్రభుత్వంలా కంపెనీలకు స్థలాలు కేటాయించకుండా ప్రభుత్వమే ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి ఆసక్తిగల కంపెనీలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఈనెలారులోపు షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

కేటాయించిన భూములు ఇలా...

504-2 సర్వే నంబరులో 3.80 ఎకరాలు, 504-3 సర్వే నంబరులో 38 సెంట్లు, 504-4 సర్వే నంబరులో 1.19 ఎకరాలు, 504-7 సర్వే నంబరులో 1.12 ఎకరాలు, 504-8 సర్వే నంబరులో 2 ఎకరాలు, 504-9 సర్వే నంబరులో 2.30 ఎకరాలు, 504-10 సర్వే నంబరులో 56 సెంట్లు కలిపి మొత్తం 11 ఎకరాల 35 సెంట్ల భూములను ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు అప్పగించారు.

భూముల పరిశీలన

జగనన్నకాలనీ పక్కన ఏర్పాటు కానున్న టెక్స్‌టైల్ పరిశ్రమల భూములను శనివారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో కలిసి ట్రేడ్ ప్రమోట్ కార్పొరేషన్ చైర్మన్ రవిచంద్రారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ బి.ప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్, ఎండీ మాట్లాడుతూ మొత్తం 11.35 ఎకరాల భూమిని ట్రేడ్ ప్రమోట్ కార్పొరేషన్‌కు అప్పగించారన్నారు. ఇక్కడ టెక్స్‌టైల్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అవసరమైన షెడ్లు, ఇతర మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. జగనన్న కాలనీల్లో నివాసాలుండే కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జగనన్నకాలనీల్లోనూ ఇదేరకంగా టెక్స్‌టైల్ పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారన్నారు. వారంలోగా భూమిపూజ చేసిఈ నెలాఖరులోగా షెడ్ల నిర్మాణాలు ప్రారంభవుతాయన్నారు.



ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, ఎండీకి భూములను చూపుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చాలా సంతోషంగా ఉంది

– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే

దాదాపు ఆరు వేలమంది మహిళలకు ఉపాధి కల్పించే పరిశ్రమ ఏర్పాటు కానుండడం చాలా సంతోషంగా ఉంది. 6 వేలమందికి ఉపాధి కలుగుతుంది. పరిశ్రమల స్థాపనకు ఏ ఒక్కరూ ప్రభుత్వానికి రూపాయి కూడా ఇవ్వలేదు. ఎవరి చేతులూ మారలేదు. భూములను పరిశ్రమలకు ఇవ్వడం లేదు. ప్రభుత్వమే పరిశ్రమలు ఏర్పాటు చేసి కంపెనీలను ఆహ్వానిస్తోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో కంపెనీలు ఆసక్తి కనబరిచి ప్రభుత్వానికి లేఖలు రాశాయి. గత ప్రభుత్వం రాప్తాడు సమీపంలో జాకీ కంపెనీ ఏర్పాటుకు ఎకరం నాలుగు కోట్లు విలువ చేసే భూములను ఎకరం రూ. 10 లక్షలకు ఇచ్చింది. లోకేష్, పరిటాల సునీతకు బేరం కుదరక 2018లో పరిశ్రమ ఇక్కడి నుంచి వెళ్లిపోయింది.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో నిజరూప పాదదర్శనం

అనంతపురం కల్చరల్: నగరంలోని రామ్ నగర్ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో శనివారం సఫల ఏకాదశి సందర్భంగా రుక్మిణీ విఠల పాండురంగ నిజరూప పాదదర్శనం భక్తిశ్రద్ధలతో జరిగింది. భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో నిజరూప పాదదర్శనం జరిగింది. మహామంగళ హారతి అనంతరం తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరు ఉన్నత పాఠశాలలో ఎంఈఓ నరసింహారెడ్డి చేతుల మీదుగా యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, నాయకులు ఎర్రిస్వామి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట



హోమం చేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో శనివారం ధ్వజస్తంభ ప్రతిష్ట జరిగింది. పాటిల్ ప్రభాకర రెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయానికి అందించిన ధ్వజస్తంభ ప్రతిష్టను అర్చకులు నరసింహశాస్త్రి, హర్షశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్ బాబు, ఆలయ కమిటీ సభ్యులు తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నంజుండయ్య సేవలు చిరస్మరణీయం

అనంతపురం కల్చరల్: అనంత రంగ స్థలానికి ఎనలేని సేవలు అందించిన నంజుండప్ప చిరస్మరణీయులని, ఆయన లేని లోటు తీర్చలేనిదని జనప్రియకవి ఏలూరు యంగన్న అన్నారు. శనివారం నంజుండయ్య మృతికి ప్రముఖ నట దర్శకుడు రాము, సీనియర్ నటులు మురళి, శివప్రసాద్, చెన్నారెడ్డి, రమేష్ తదితరులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. నంజుండప్పకు భార్య, కొడుకును పరామర్శించి, ధైర్యం చెప్పారు.

ఆకట్టుకున్న ఉపన్యాస పోటీలు

అనంతపురం కల్చరల్: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మై భారత్ - వికసిత్ భారత్ 2017 అనే అంశంపై శనివారం నిర్వహించిన ఉపన్యాస పోటీలు ఆకట్టుకున్నాయి. ఎన్‌వైకే సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమానికి ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, ఆధ్యాత్మికవేత్త జీఎల్‌ఎన్ శర్మ, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు భరత్, జీవన్‌కుమార్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్ , జాతీయ యువ సేవా కార్యకర్త వెంకటేష్ ఆత్మీయ అతిథులుగా పాల్గొని, ప్రసంగించారు. అనంతరం వరుసగా మూడు స్థానాలను దక్కించుకున్న వెన్నెల, మహతేష్, ఆదిత్యరాజ్, నాగరత్న ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

పేరూరు డ్యాంకు నీళ్లిచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదే



రామగిరి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రామగిరి: దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందించారని, పార్టీలు,కులమతాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ హయాంలో ప్రజా సంక్షేమాన్ని పట్టించుకున్న పాపానపోలేదని, పరిటాల సునీత కుటుంబం దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకొందన్నారు. వారి హయాంలో దోపిడీ పాలన సాగిందని, పేరూరు డ్యాంకు హంద్రీనీవా నుంచి నీరు తెచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదేనన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చెరువులను నింపినట్లు తెలిపారు. శనివారం మండలంలోని ఎంసీపల్లి, పెద్ద కొండాపురం, పేరూరు, నసనకోట, రామగిరి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి పంచాయతీల్లో పింఛన్ల పెంపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలకు రూ.3 వేలు పింఛన్ అందించారు.

ప్రజల దరికే నేరుగా సంక్షేమ పథకాలు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.500 పింఛన్ వచ్చేదని, అదికూడా సక్రమంగా ఇవ్వలేక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. నేడు వలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ వేకువజామునే పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా ఈప్రాంతానికి చెందిన పరిటాల కుటుంబ సభ్యులు మంత్రులు, ఎమ్మెల్యేలుగా పదవులు అనుభవించి, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. గతంలో వర్షాలు రాక, పంటలు పండక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ వారు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను రెచ్చగొడుతున్నారేగానీ పేదలకు చేసిందేమీ లేదన్నారు. రామగిరి మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని, ఇక్కడ వారు చెప్పిందే చట్టం అనేవిధంగా చేసేవారన్నారు. ప్రస్తుతం ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కర్రా హనుమంత రెడ్డి, సర్పంచులు మీనుగ నాగరాజు, రాజేష్, నరేంద్ర, రామ్మూర్తి, సిద్ధన్న ఓబిరెడ్డి, చెన్నకేశవ రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, జయ చంద్రారెడ్డి, మల్లికార్జున, రామలింగారెడ్డి, జేష్ఠ రామయ్య, అనిల్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లోపే తుంగభద్ర జలాలు

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల పరిధిలోని పాపంపేట, కక్కలపల్లి కాలనీ, కురుగుంట, కామారుపల్లి, చిన్నంపల్లి, రాచానపల్లి పంచాయతీలకు ఎన్నికల్లోపే తుంగభద్ర జలాలు తీసుకొస్తామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం నుంచి అనంతపురం రూరల్ మండలం పాపంపేట వరకు జరిగే పైప్ లైన్ పనులకు చిన్నంపల్లి పంచాయతీ కళ్యాణదుర్గం ప్రధానరోడ్డులో శనివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో రెండు ప్యాకేజీల కింద పనులు జరుగుతున్నాయన్నారు. మార్చి నెలాఖరు నాటికి పీఏబీఆర్ డ్యాం నుంచి పాపంపేట వరకు నీళ్లిస్తామన్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి పర్యటనలో తాగునీటి సమస్యను తీసుకెళ్లామన్నారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాలకు నాలుగు ప్యాకేజీలను జగనన్న అక్కడికక్కడే ప్రకటించారన్నారు.



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ప్రస్తుతం రెండు ప్యాకేజీల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. తక్కిన రెండు ప్యాకేజీల పనులు ఈ నెలాఖరులోపు ప్రారంభమవుతాయన్నారు. నాలుగు ప్యాకేజీల కింద నియోజకవర్గంలోని 139 గ్రామాలకు తాగునీరు ఇస్తున్నామన్నారు. పెరిగిన అంచనాలతో కలిపి రూ.150 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అనంతపురం, ఆత్మకూరు ఎంపీపీలు వరలక్ష్మి, హేమలత, వైఎస్సార్ సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, ఆత్మకూరు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు చిన్నంపల్లి వెంకటరాముడు, వడ్డే శీనా, డాక్టర్ శీనా, ఆదినారాయణ, లక్ష్మిరెడ్డి, కిరణ్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి,సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత



కార్యక్రమానికి హాజరైన పింఛన్‌దారులు

- నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వైఎస్సార్ పింఛన్ కానుక రూ. 3 వేలు పెంచిన సందర్భంగా రుద్రంపేట, ఏ.నారాయణపురం పంచాయతీల్లో పింఛన్ల మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎవరి సిఫార్సులు లేకుండానే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వచ్చిన తర్వాత వాటిని మర్చిపోవడం చంద్రబాబు నైజమన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా..ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రూ.2 వేలున్న పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారమే పింఛన్‌ను పెంచినట్లు తెలిపారు. గతంలో కంటే ఎక్కువ మందికి లబ్ధి చేకూరుస్తూ అవ్వాతాతల కళ్లలో ఆనందం వెల్లివిరిసేలా చేశారన్నారు.

అభివృద్ధికి అడ్డొస్తే.. సహించేదిలేదు..

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పని చేస్తోందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు చేరువ చేయడంతో పాటు నగరానికి దీటుగా పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులు స్వలాభం కోసం వర్గాలుగా విడిపోయి రుద్రంపేట పంచాయతీ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారనాన్రు. తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాతనే రుద్రంపేట పంచాయతీ అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. దాదాపు రూ.52 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టి, పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. స్వలాభం కోసం అభివృద్ధికి అడ్డుపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. వలంటీర్లు మరింత చొరవతో పనిచేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

మళ్లీ జగన్ సీఎం అయితేనే పేదలకు న్యాయం:

2024 ఎన్నికల్లో మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటేనే పేదలకు న్యాయం జగరుతుందని ఎమ్మెల్యే అన్నారు. వచ్చే ఎన్నికలు పేదలకు, పెతందార్లకు మధ్య జరుగుతున్నాయని, అధికారం కోసం అపద్ధపు హామీలు ఇచ్చి, తప్పించుకునే నాయకులు కావాలో..ఎన్ని కష్టాలొచ్చినా ఇచ్చిన మాటకు కట్టుబడి, ఇచ్చిన హామీలు అమలు చేసి ప్రజలకు అండగా నిలబడే నాయకులు కావాలో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నాయకులు చెప్పే బూటకపు హామీలు నమ్మి మోసపోకుండా, మంచి చేస్తున్న ప్రభుత్వానికి మరోమారు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం పింఛన్ లబ్ధిదారులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ చంద్రకుమార్, ఎంపీటీసీలు మహబూబీ, నారాయణమ్మ, ఓం ప్రకాష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు సాదిక్‌వలి, మల్లెల వేణుగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తం, తిరుపతి నాయుడు, పురుషోత్తం, వెంకటేష్ నాయక్, రాజారత్నం, నాగరాజు, రాజునాయక్, మూర్తి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే నివాస ఆవరణలో 41వ డివిజన్‌కు చెందిన దస్తగిరి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్ష చెక్కు అందించారు. షేక్ మహీనా, చందనలకు షాదీ తోఫా, కళ్యాణమస్తు కింద మంజూరైన రూ.లక్ష అందించారు. డివిజన్‌లో కొత్తగా మంజూరైన 15 మందికి ఎమ్మెల్యే పింఛన్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సీనియర్ నేత చింతా సోమశేఖర్ రెడ్డి, డివిజన్ నాయకులు సుహాసిని, విజయ్, వీరాంజి, 59, 60 సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చెన్నేకొత్తపల్లి: మండలంలో ఆదివారం జరగనున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి ఓ ప్రటకనలో తెలిపారు. ఉదయం మేడాపురం, వెంకటాంపల్లి, చెన్నేకొత్తపల్లి, న్యామద్దల గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో జరగనున్న గ్రామ సభలకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

పశువులకు టీకాలు

గార్లదిన్నె: మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు టీకాలు వేస్తోందన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న హిందుత్వ సంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్: అయోధ్య రామాలయం అక్షింతలతో శనివారం హిందుత్వ సంఘాల ప్రతినిధులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన విధంగా వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా శ్రీరాముడి భవ్య మందిరం సర్వాంగ సుందరంగా కొలువుదీరుతోందన్నారు. ప్రధానమంత్రి చేతుల మీదుగా ఈనెల 22న ప్రారంభం కానుందన్నారు. అనంతరం కోర్టురోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయ పరిసరాలు, రహమత్‌నగర్‌లో ఇంటింటా అయోధ్య అక్షింతలు, అయోధ్య రామాలయ విశిష్టతను తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు. హిందుత్వ సంఘాల ప్రతినిధులు దుద్దేకుంట వెంకటేశ్వరరెడ్డి, గోవర్ధన్, గోపాలరావు, నాగేంద్రరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ అర్చకులు నగేష్, కేశవ్ చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస గ్రామోత్సవం



కనకదాస విగ్రహం



గ్రామోత్సవంలో పాల్గొన్న కురుబలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో కనకదాస గ్రామోత్సవం శనివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు, యువతులు పెద్ద ఎత్తున జ్యోతులు పట్టుకొని, విగ్రహం ముందు గ్రామోత్సవం నిర్వహించారు. కనకదాస విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, ఊరేగింపు చేశారు. విగ్రహం ముందు గొరవయ్యలు నత్యం చేశారు.

నేడు విగ్రహ ప్రతిష్ట : ఆత్మకూరులో ఆదివారం ఉదయం 6 గంటలకు కనకదాస విగ్రహాన్ని ప్రతిష్టించనున్నారు. అనంతరం 10 గంటలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ జరగనుంది. విగ్రహ ప్రతిష్టకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కురుబలు తరలిరావాలని కురుబలు పిలుపునిచ్చారు.